ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 18 సెప్టెంబరు 2025 | 5



బాకీ తీర్చేస్తానని పిలిచి.. బావిలోకి తోసేసి.. ఇద్దరి హత్య 7

16వ నెంబరు జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు 7

స్క్రూడ్రైవర్ నెయిల్ మింగిన బాలుడు 7

రేపు కొత్త టీచర్లకు నియామకపత్రాల జారీ 7

ఫ్లాట్‌కి నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్ 7

ఘనంగా ప్రధాని పుట్టినరోజు వేడుకలు

- బీజేపీ జిల్లా కార్యాలయంలో 82మంది కార్యకర్తల రక్తదానం



మోదీ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా కాకినాడలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలతో నిర్వహించిన శిబిరంలో 82మంది బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినం సందర్భాన్ని సేవా కార్యక్రమాలుగా మలచి ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించడం ఆయన నాయకత్వంలోని ప్రత్యేకత అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలగ్రామ లక్ష్మీప్రసన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, రాష్ట్ర నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణ రాజు, యార్లగడ్డ రామ్‌కుమార్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లి మరణించిన మత్స్యకారులకు పరిహారం: ఎంపీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లలో కాకినాడ జిల్లాలో 18మంది మత్స్యకారులు వేటకు వెళ్లి మరణించారన్నారు. గ్రూపు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ద్వారా బాధిత కుటుంబాలకు పరిహారం విడుదల చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు, మత్స్యశాఖ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. ఈ నేపథ్యంలో గత ఐదేళ్లలో మరణించిన మత్స్యకారుల వివరాలను అధికారులు సేకరించారన్నారు. త్వరితగతిన పరిహారం విడుదలకు కృషి చేస్తున్నామని తెలిపారు.

అధ్యక్షా..!



- నేటి నుంచే అసెంబ్లీ సమావేశాలు
- నియోజకవర్గ సమస్యల ప్రస్తావనకు సిద్ధమైన ఎమ్మెల్యేలు

- ఏలేరు వరదల గండ్లు పూడ్చివేత, వంద పడకల ఆసుపత్రిపై ఎమ్మెల్యే రాజప్ప ప్రశ్నలు
- స్మార్ట్‌సిటీకి వెయ్యికోట్లు, జీజీహెచ్, టిడ్కో ఇళ్ల పూర్తిని సభ దృష్టికి తేనున్న ఎమ్మెల్యే వనమాడి
- నర్సింగ్ కాలేజీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డంపింగ్ యార్డుపై తుని ఎమ్మెల్యే దివ్య ప్రశ్నలు
- పారిశ్రామికపార్కు, ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుపై ప్రశ్నించనున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- విలీన పంచాయతీల ఇబ్బందులను లేవనెత్తబోతున్న ఎమ్మెల్యే నానాజీ
- సుబ్బారెడ్డిసాగర్, ఏలేరు, పెన్షన్‌పై ప్రస్తావించనున్న ఎమ్మెల్యే సత్యప్రభ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో సమస్యలను ఏకరువు పెట్టేందుకు జిల్లా ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని, ప్రజలను వేధిస్తున్న పలు కీలక సమస్యలు, అంశాలపై సభలో ప్రశ్నలు లేవనెత్తేందుకు సమాయత్తమయ్యారు. ప్రశ్నోత్తరాలకు, సభలో ప్రస్తావించనున్న అంశాలకు సంబంధించి ఇప్పటికే శాసనసభ కార్యాలయానికి వివరాలు పంపించారు. ఈ మేరకు సభలో ప్రశ్నించాల్సిన, ప్రస్తావించాల్సిన జాబితాలు సిద్ధం చేసుకున్నారు. పదిరోజులపాటు జరగనున్న సమావేశాల్లో నియోజకవర్గాలకు కావాల్సిన నిధులు, పలు పనులకు అనుమతులు సాధించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

గతేడాది ఏలేరు వరదలకు పెద్దాపురం నియోజకవర్గంలో పలుచోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. వీటి పూడ్చివేతకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ కీలక సమస్యలను శాసనసభలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వివరించారు. గతనెల 23న సీఎం చంద్రబాబు పెద్దాపురం పర్యటనకు వచ్చిన సమయంలో పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భూముల సేకరణ అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చి వేగంగా ఈ పని జరిగేలా ప్రస్తావించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో పీపీపీ విధానంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్లు గతంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. తన నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్, ప్రభుత్వ భాగస్వామ్యంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరుచేయాలని సభ ద్వారా ఆరోగ్యశాఖ మంత్రిని కోరనున్నట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వివరించారు. జగ్గంపేట మండలం మల్లిశాలలో 450ఎకరాల ప్రభుత్వభూమి, 75ఎకరాల ప్రైవేటు భూమి కలిపి మొత్తం 525ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని సభలో కోరనున్నారు. గోకవరం మండలం భూపతిపాలెంలో గురుకుల పాఠశాల, ప్రభుత్వానికి చెందిన 450ఎకరాలు అందుబాటులో ఉన్నందున ఇక్కడ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటుచేయాలని సభ ద్వారా కోరనున్నారు. ఈమేరకు ఆయా అంశాలకు సంబంధించిన పాయింట్లను శాసనసభ కార్యాలయానికి పంపించారు.

ఏలేరు.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీపైన..

తుని పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవసరం అని ఎమ్మెల్యే దివ్య ప్రభుత్వాన్ని కోరనున్నారు. ఈ సదుపాయం లేక పట్టణంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని సభలో కోరనున్నారు. నియోజకవర్గంలో మహిళా నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని సభ ద్వారా కోరబోతున్నారు. పుష్కర కాలువ ఆధునికీకరణ పనులు తక్షణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకురానున్నట్లు తెలిపారు. తుని పట్టణంలో డంపింగ్ యార్డు నిర్మాణంపై ప్రభుత్వాన్ని కోరనున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ పరిధిలో గిరిజనులు పడుతున్న ఇబ్బందిని ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే సత్యప్రభ తెలిపారు. ప్రత్యేక ఐటీడీఏ లేదంటే ఆస్థాయి వసతులు కల్పించాలని కోరనున్నారు. ఏలేరు ఆధునికీకరణ ప్రతిపాదనలు సాధ్యమైనంత వేగంగా ఈ పనులు చేపట్టాలని కోరనున్నారు.

స్మార్ట్‌సిటీ.. విలీన సమస్యలపై..

కాకినాడ స్మార్ట్‌సిటీకి రూ.వెయ్యికోట్ల వరకు నిధుల అవసరంతో పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాల్సిన అవసరాన్ని సభలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ఆగిపోయాయని, మళ్లీ స్మార్ట్‌సిటీ పనులు పట్టాలెక్కాలంటే పాత బిల్లులు మంజూరు చేయాలని కోరనున్నారు. అనేక తరగతి గదుల నిర్మాణం పూర్తయినా బిల్లులు చెల్లించక ఆగిపోయాయని, వీటిని పూర్తి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. నగరానికి కీలకమైన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిధులు లేక పనిచేయని అంశాన్ని సభాపతి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి వేగంగా లబ్ధిదారులకు అందించేలా అధికారులను ఆదేశించాలని కోరనున్నారు. ఉప్పుటేరు వంతెనపై మూడో బ్రిడ్జికి నిధులు కోరనున్నారు. కాకినాడ రూరల్‌లో 8 పంచాయతీలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయక, పంచాయతీ హోదా కొనసాగించక పోవడంతో 15వఆర్థిక సంఘం నిధులు ఆగి ఇబ్బందులు పడుతున్న విషయం సభలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. గత వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ అస్తవ్యస్తంగా మారిందని, పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం సభలో మాట్లాడనున్నారు. అప్పట్లో తహసీల్దార్ సంతకాలు లేకుండా పట్టాలు పంపిణీ చేసి పేదలను మోసం చేసిన అంశాన్ని సభ దృష్టికి తీసుకువెళ్లనున్నారు.

పరిహారం లేదు.. పొలం లేదు

- గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలకు సేకరించిన భూములకు ఇంకా అందని పరిహారం
- కూటమి ప్రభుత్వమైనా ఇచ్చి ఆదుకోవాలని రైతుల వినతి
- నాలుగేళ్లుగా పెండింగ్‌లోనే రూ.45కోట్లు
- లబోదిబోమంటున్న రైతులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగనన్న కాలనీ కోసం రైతులనుంచి పెద్దఎత్తున భూములను సేకరించింది. భూసేకరణ జరిగింది, పేదలకు పట్టాలు కూడా ఇచ్చేశారు. కానీ నాలుగేళ్లుగా భూములిచ్చిన రైతులకు మాత్రం ఒక్క పైసా పరిహారం ఇవ్వలేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

జిల్లాలో 2019-2024(వైసీపీ ప్రభుత్వం) హయాంలో జగనన్న కాలనీల కోసం 3151 ఎకరాల భూములను సేకరించింది. దీనిలో 3038 ఎకరాల రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. 113 ఎకరాలకు సంబంధించి 115 మంది రైతులకు మాత్రం పరిహారం కింద ఒక్క పైసా చెల్లించలేదు. వీరికి మొత్తంగా రూ.45కోట్లు బకాయిలు ఉండిపోయాయి. గత నాలుగేళ్లుగా రైతులు కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక్కొక్కరికి ఎకరానికి రూ.28లక్షల నుంచి రూ.58లక్షల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఓవైపు భూసేకరణ పూర్తయింది, జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేశారు కానీ భూయజమానికి మాత్రం చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇటు రైతు పొలం పండించుకుని ఆదాయం పొందే అవకాశం కోల్పోయాడు. అటు పరిహారం రాక ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నాడు. గత ప్రభుత్వహయాంలో ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్న రైతులు వేగంగా భూపరిహారం తెచ్చుకున్నారు. కానీ కొంతమంది సామాన్యులు మాత్రం బలైపోయారు. తమ భూములకు పరిహారం ఇవ్వాలని పలుమార్లు ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం మినహా ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయారు. 115మంది రైతుల్లో ఎక్కువగా కాకినాడరూరల్ మండలం, తాళ్లరేవు మండలం, యు.కొత్తపల్లి మండలాల్లో ఉన్నారు. సామర్లకోట మండలం, పిఠాపురం, పెదపూడి, కరప, పెద్దాపురం, తుని మండలాల రైతులు కూడా ఉన్నారు.

ఈ ప్రభుత్వమైనా ఇవ్వాలి

ఇళ్లపట్టాల కోసం వైసీపీ ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం కూటమి ప్రభుత్వం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. తమకు పరిహారం సకాలంలో అందకపోవడం వల్ల అనేక ఆర్థికఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పిల్లలకు విద్యకు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నామని, నిర్ణయించిన సమయానికి తమ బిడ్డలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నామని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. చేసిన అప్పులు తీర్చకపోవడంవల్ల వడ్డీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

-జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

భూసేకరణ చేసిన రైతులకు పెండింగ్లో ఉన్న రూ.45కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదికపంపాం. రైతుల ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. త్వరలో ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తుందనే నమ్మకం ఉంది. పరిహారం విడుదలైన వెంటనే రైతులకు అందజేస్తాం. వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ప్రపంచ తొలి వాస్తుశిల్పిగా విశ్వకర్మ

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్


విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా విరాట్ విశ్వకర్మ గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి అని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, డీఆర్వో వెంకట్రావు,విశ్వబ్రాహ్మణ సంఘాలనాయకులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దైవిక వాస్తుశిల్పి అయిన విశ్వకర్మ పుట్టినరోజును ప్రభుత్వ సూచనల ప్రకారం ఘనంగా నిర్వహించామన్నారు. హిందూ సనాతన ధర్మం ప్రకారం దివ్య వ్రంగిగా విరాట్‌విశ్వకర్మ తొలివ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, ఉద్యోగులు పి.రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, కే.సూర్యశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

- ఎమ్మెల్యే వనమాడి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా, ఆర్థికంగా, అన్నివిధాలా మెరుగ్గా ఉన్నప్పుడే సమాజాభివృద్ధి మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజిల్లుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ కొండయ్యపాలెంలోని ప్రకాశం స్ట్రీట్‌లో ఉన్న యూపీహెచ్‌సీలో బుధవారం స్వస్థనారీ-శక్తివంతమైన కుటుంబం అభియాన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్,ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి,ఐసీడీఎస్ పీడీ చెరుకూరి లక్ష్మిలతో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం.. మహిళలకు సమయానుకూల వైద్యసేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడంతో మహిళలు ఆరోగ్యరీత్యా బలోపేతమవుతారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో బుధవారం 44 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు జరిగాయన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అక్టోబరు 2 వరకు ప్రత్యేక వైద్యశిబిరాలు, వైద్యనిపుణులు, పారామెడికల్ సిబ్బంది ద్వారా ఈ వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ వైద్యశిబిరాల్లో మహిళల్లో తలెత్తే గుండెజబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్లను పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను అవసరమైతే రిఫరల్ సేవలను అందిస్తామన్నారు. పిల్లల్లో సికిల్‌సెల్ అనీమియ గుర్తించి అవసరమైన వారికి చికిత్స అందజేయడం.. పిల్లలకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలుఅందిస్తారన్నారు.కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ మోకా పవన్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ చిట్ల కిరణ్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, విజయవాడకు చెందిన వివిధ విభాగాల ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ విజయ్, డాక్టర్ కార్తిక్ పాల్గొన్నారు.

పట్టణ పేదలకు గృహయోగం



పట్టణ పేదలకు గృహయోగం కలిగింది. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకుందామని భావించిన వారికి వైసీపీ హయాంలో మొండిచేయి చూపగా కూటమి ప్రభుత్వం మాత్రం వారికి అవకాశం కల్పించింది. గతం కంటే రూ.లక్ష అధికంగా ఇంటి నిర్మాణానికి అందించనున్నది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాలు, నగరాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్‌యోజనా పథకం 2.0 అర్బన్ హౌసింగ్ కింద 3,458 గృహాలు మంజూరు చేయగా ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పక్రియ పూర్తి చేశారు.

- పీఎంఏవై-2 కింద ఉమ్మడి జిల్లాకు 3,458 ఇళ్లు
- యూనిట్ వ్యయం రూ.2.50 లక్షలకు పెంపు
- వైసీపీ హయాంలో ఇచ్చింది రూ.1.50 లక్షలే
- అదీ జగనన్న కాలనీల వారికే పరిమితం
- ఇప్పుడు సొంత స్థలాలు ఉన్న వారికీ అవకాశం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- జియోట్యాగింగ్ చేస్తున్న హౌసింగ్ సిబ్బంది

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పట్టణాలు, నగరాల్లో సొంత స్థలాలు ఉండి గృహాలు నిర్మించుకుంటామని ముందుకు వచ్చిన వారికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించి గృహాలు మంజూరు, నిధులు కేటాయింపునకు సంబంధించిన జీవో జారీ కావడంతో గృహ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దాదాపు ఆరేళ్ల అనంతరం సొంత స్థలాలు ఉన్నవారికి గృహయోగం కలగనున్నది. వైసీపీ హయాంలో జగనన్న కాలనీల్లో స్థలాలు ఉన్నవారికి మినహా ఇతరులు ఎవ్వరికి గృహనిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయలేదు. దీంతో జగన్ ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరంతా తమకు గృహాలు మంజూరు చేయాలంటూ నాటి ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణాలు చేసినా ఎటువంటి ఫలితం లేకపోయింది.

కూటమి ప్రభుత్వం రాగానే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణ, నగర ప్రాంతాల్లో పేదలకు గృహనిర్మాణంపై దృష్టి సారించింది. ఇందు నిమిత్తం కాకినాడ జిల్లాలోని కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు పట్టణాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణాలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరంతోపాటు కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో ఈ ఏడాది జనవరి నుంచి సొంత స్థలాలు ఉన్న పేదలు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుదారుల స్థలాలు, వారి అర్హతలు పరిశీలించి అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

నిధులు పెంచి మంజూరు

ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో గృహాలకు ఒకొక్కదానికి రూ.1.50 లక్షలు ఇస్తుంది. వైసీపీ హయాంలో ఈ నిధులను మాత్రమే జగనన్న కాలనీలకు కేటాయించి సొంతబాకా కొట్టుకుంది. కూటమి ప్రభుత్వం మాత్రం పెరిగిన గృహనిర్మాణ వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని కేంద్రం ఇచ్చే రూ.1.50 లక్షలకు అదనంగా మరో లక్ష రూపాయలను ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు గృహాల మంజూరు సందర్భంగా నిధులు పెంపును వర్తింపజేస్తూ జీవో జారీచేసింది. జిల్లాల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.86.45 కోట్లు వ్యయంతో 3,458 గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాకు రెండు విడతలకు కలిపి 2,226 గృహాలు మంజూరు చేయగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 475, తూర్పుగోదావరి జిల్లాకు 757 గృహాలు కేటాయించారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరానికి 1165 గృహాలు, పిఠాపురం పట్టణానికి 200, గొల్లప్రోలుకు 110, పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు 348, తునికి 131, ఏలేశ్వరం పట్టణానికి 272 గృహాలు మంజూరయ్యాయి.

నిధులు ఇలా ఇస్తారు..

పీఎంఏవై పథకం కింద గృహాలు కేటాయింపు పూర్తికావడంతో హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడంతో పాటు స్థలాలను జియోట్యాగింగ్ చేస్తున్నారు. ఈ పక్రియ పూర్తికాగానే లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందజేసి పనుల ప్రారంభానికి అనుమతిస్తారు. లబ్ధిదారులకు స్లాబ్, లింటల్ (గోడలు), స్లాబు దశలతోపాటు పూర్తైన తర్వాత ఇలా నాలుగు దశల్లో సొమ్ములను వారి ఖాతాలకు చెల్లిస్తారు. ఈ దశలన్నింటిలో హౌసింగ్ సిబ్బంది గృహ నిర్మాణ పురోగతిని ఫోటోలు తీసి అప్‌లోడ్ చేసిన తర్వాతే సొమ్ములు చెల్లింపు జరుగుతుంది. ఆరేళ్ల తర్వాత తమ స్థలాల్లో గృహాలు నిర్మించుకునే అవకాశం లభించడంతో పట్టణ పేదలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు, కూటమి ప్రభుత్వం ద్వారా తమ సొంతింటి కల నేరవేరబోతున్నదని వారు తెలిపారు. కొన్ని పట్టణాల్లో ఇప్పటికే కొందరు లబ్ధిదారులు పునాదుల వరకూ నిర్మాణాలు పూర్తి చేశారు. దీనిపై కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పీఎంఏవై అర్బన్ కింద పట్టణాలు, నగరాల్లో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఒక్కొక్క గృహ నిర్మాణానికి లబ్ధిదారునికి రూ.2.50 లక్షలు ఇవ్వనుందన్నారు. ఇప్పటికే అర్హులుగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేసి జియోట్యాగింగ్ చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడులు

- గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఎరువుల దుకాణం లైసెన్సు రద్దు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు విక్రయిస్తున్న దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు బుధవారం కూడా దాడులు చేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శ్రీ నాగదుర్గ ఏజెన్సీస్ ఎరువుల దుకాణం లైసెన్సు రద్దు చేశారు. ఈ దుకాణంలో యూరియా రూ.267కు అమ్మాల్సి ఉండగా రూ.310కి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మండల వ్యవసాయ అధికారి కేవీవీ సత్యనారాయణ తనిఖీలు చేశారు. అధిక ధరలకు విక్రయించినట్లు ధ్రువీకరించడంతో వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ లైసెన్సు రద్దు చేశారు.

జిల్లాకు మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియాకావాలని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ప్రతిపాదనను పంపారు. మరో రెండురోజుల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందన్నారు. బుధవారం జిల్లాకు చేరుకున్న 1350 మెట్రిక్ టన్నుల యూరియా టోకెన్ల విధానంలో రైతులకు పంపిణీ చేశామన్నారు.

పుష్కలంగా యూరియా నిల్వలు

జిల్లా వ్యవసాయాధికారి

గొల్లప్రోలు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఈఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం ఆయన పర్యటించి రైతుసేవాకేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంటపొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బుధ, గురువారాల్లో గొల్లప్రోలు మండలంలోని సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు 90టన్నులు, ప్రైవేటు దుకాణాలకు 60 టన్నులు యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌కు ఈనెల 30లోగా రైతులు తాము వేసిన పంట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఆయనవెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, రైతుసేవాకేంద్రం సిబ్బంది ఓలేటి శివాజీ ఉన్నారు.



బంగారు చేప చిక్కింది.. 1.5 కిలోలు రూ.6 వేలు

కాకినాడ కుంభాభిషేకం ఫిషింగ్ హార్బర్ వద్ద ఒక జాలర్ వలకి బంగారు చేప చిక్కింది. 1.5 కిలోలు బరువున్న ఈ చేప రూ.6 వేల దర పలికింది. ఈ చేపను ఘోల్ చేప అని పిలుస్తారు. రంగును బట్టి బంగారు చేపగానూ పిలుస్తారు. ఈ చేపలోని గాల్ బ్లాడర్‌ను మందుల తయారీలో ఉపయోగిస్తారు. అందుకే దీనికి ఇంత డిమాండ్ ఉంటుందని మత్స్యకారులు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి/ కార్పొరేషన్(కాకినాడ)



జీజీయూలో 'లిటిల్ హార్ట్స్'

లిటిల్ హార్ట్స్ చిత్ర బృందం రాకతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. లిటిల్ హార్ట్స్ సినిమా విజయ యాత్రలో భాగంగా ప్రముఖ హీరో మౌళి, నటుడు జయకృష్ణ జీజీయూను సందర్శించారు. ఈ సందర్భంగా సినిమాలోని కొన్ని డైలాగ్‌లను చెప్పి విద్యార్థులనుద్దేశించి కొద్దిసేపు మాట్లాడారు. విద్యార్థులు సినీనటులతో కలిసి ఫొటోలు తీయించుకునేందుకు ఆసక్తి చూపారు. అనంతరం హీరో మౌళిని జీజీయూ తరపున సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

- ఆంధ్రజ్యోతి/ రాజానగరం



'ఆదిత్య'లో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్

గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ మోటారు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేటీఎం అకాడమీ సేఫ్ రైడింగ్ ఈవెంట్‌ని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. వందమందికి పైగా విద్యార్థులు ప్రొఫెషనల్ సేఫ్ రైడింగ్, రైడర్-డిసిప్లిన్, మోటారు స్పోర్ట్స్ భద్రతా ప్రమాణాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. హైదరాబాద్ కేటీఎం అకాడమీ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్ అమన్, ఆదిత్య తమ బృందంతో సేఫ్ రైడింగ్ నిర్వహించారు. - ఆంధ్రజ్యోతి/గండేపల్లి

నిరంతరాయంగా 'సుభోజనం'

దశాబ్దకాలంగా జీజీహెచ్‌లో హరేకృష్ణ మూమెంట్ వితరణ సేవ

ఉచితంగా నిత్యం వందలాది మంది ఆకలి తీరుస్తున్న దాతలు

రూ.10తో ఆరంభం.. ఇప్పుడు ఉచితం



భోజనం వడ్డిస్తున్న దాతతో కలసి వైకుంటేశ్వర దాస

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదానాల్లో అన్నదాతం గొప్పది అంటారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ ఏముంటుందని అందరూ భావిస్తారు. ఈ భావనతో దైవకార్యంలో ఉండే ఇస్కాన్ అన్నార్తుల ఆకలి తీర్చే పనిలో నిమగ్నమైంది. వీరి ఆధ్వర్యంలో పనిచేస్తున్న హరేకృష్ణ మూమెంట్ సంస్థ కాకినాడ జీజీహెచ్‌లో 'సుభోజనం' పేరుతో దాతల సహకారంతో వేలాది మంది రోగుల సహాయకులకు, నిరుపేదలకు హోటళ్లకు దీటుగా మంచి ఉచిత భోజనాన్ని అందిస్తోంది. జీజీహెచ్‌లో గత పది సంవత్సరాలుగా ఈ హరేకృష్ణ మూమెంట్ అండ్ టచ్ స్టోన్ ఛారిటీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిరంతరాయంగా నడుస్తోంది. తొలుత రూ.10లకు ప్రారంభమైన ఈ సుభోజనం కొంతకాలం తరువాత దాతల సహకారంతో 90 శాతం ఉచిత భోజనంగా మారింది. రోగుల సహాయకులు 2016కు ముందు జీజీహెచ్ సమీపంలో ఉన్న హోటళ్లలో రూ.80 నుంచి రూ.100 ఖర్చు చేసి భోజనం కొనుగోలు చేసేవారు. అయితే జీజీహెచ్‌కు వచ్చేవారు ఎక్కువశాతం నిరుపేదలే కాబట్టి ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. సుభోజనం ప్రారంభించాక భోజనానికి ఖర్చు చేసే నగదు మందులకు ఉపయోగపడేవి అయితే సుభోజనం కౌంటర్‌లోని భోజనం బయట హోటళ్లకన్నా రుచిగా, శుచిగా ఉంటుందని రోగుల సహాయకులు చెబుతున్నారు.

ఇక సుభోజనం మొదలైన ఈ పదేళ్లలో జీజీహెచ్‌లో 20 లక్షల మందికి అన్న వితరణ జరిగింది. రెండు పూటల సుభోజనం సేవలు జరుగుతున్నాయి. ప్రతిరోజు సుమారు 850 మందికి అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు 40 లక్షల మందికి ఉచిత భోజనం అందజేయడం జరిగిందని సుభోజనం సమన్వయకర్త వైకుంటేశ్వరదాస తెలిపారు. అలాగే కేజీహెచ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బాబా టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పటల్‌లో 2023లో సుభోజనం ప్రారంభించడం జరిగింది. అలాగే 2018లో విజయవాడ జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. అలాగే 2021లో నెల్లూరు జీజీహెచ్‌లో సుభోజనం ప్రారంభించాం. మన కాకినాడ జీజీహెచ్‌తో కలిపి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5 సుభోజనం కౌంటర్ల ద్వారా ఇప్పటివరకు 75 లక్షల మంది రోగుల సహాయకులకు భోజన వితరణ కార్యక్రమం నిర్వహించామని వైకుంటేశ్వర దాస చెప్పారు. హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకులు భక్తి వేదాంతస్వామి ప్రభు. ఈ సంస్థ ఆశ్రమాలకు పది మైళ్ల దూరంలో ఎవరూ ఆకలితో ఉండరాదు అనే ఆయన ఆశయం మేరకు ఈ సుభోజనం ప్రారంభించినట్టు చెప్పారు. కాకినాడ జీజీహెచ్‌లో సుభోజనాన్ని విస్తరింపజేయడం, మరికొంతమందికి రుచిగల భోజనాన్ని అందించేందుకు దాతలు ఫోన్ నెంబర్ 8096211108ను సంప్రదించవచ్చని వైకుంటేశ్వరదాస చెప్పారు.



మధురుపూడి విమానాశ్రయంలో బుధవారం నిర్వహించిన యాత్రీ సేవా దివస్‌లో భాగంగా ప్రయాణికులకు సంప్రదాయ స్వాగతం.. కూచిపూడి నృత్యం చేస్తున్న బాలికలు



విమానాశ్రయంలో...



విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్‌లో భాగంగా రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా యాత్రీ సేవా దివస్

కోరుకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవా దివస్-2025 వేడుకలు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ వేడుకల్లో విమానాశ్రయ డైరెక్టర్ ఎస్‌కె.శ్రీకాంత్ నేతృత్వంలో రాజమండ్రి విమానాశ్రయం విశేషంగా పాల్గొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలను అందించాలనే నిబద్ధతను ప్రతిబింబించేలా ఈ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రయాణికులు, ప్రజలు విశేషంగా స్పందించారన్నారు. కాగా వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆతిథ్య సత్కారాలు నిర్వహించారు. అలాగే ఏక్ పేడ్ మాకే నామ్ నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు విమానాశ్రయ సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. యాత్రీ సేవా దివస్ ద్వారా ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం, భారతీయ విమానాశ్రయాలను మరింత కలుపుకుని స్థిరమైన, ప్రయాణికులకు అనుకూల వాతావరణంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని శ్రీకాంత్ వివరించారు. ఈ వేడుకలు విమానాశ్రయాలు, ప్రయాణికుల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించాయని ఆయన అభిప్రాయపడ్డారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం

రూ.1.49 కోట్లు

» బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు

» ఏడు దేశాల కరెన్సీ లభ్యం » వెల్లడించిన ఉప కమిషనరు, ఈవో

ఆత్రేయపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం తెరిచి లెక్కించారు. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టీవీఎస్‌ఆర్ ప్రసాద్, ఎం.సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 27 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,15,09,966, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.34,11,312 ... మొత్తం రూ.1,49,21,278 ఆదాయం లభించింది. బంగారం 28 గ్రాములు, వెండి 2.180 కిలోలు, ఏడు దేశాలకు చెందిన 45 కరెన్సీ లభించించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆంధ్ర యువ సంకల్ప్ డిజిటల్ మారథాన్‌కు వీడియోలు ఆహ్వానం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతను భాగస్వామ్యం చేస్తూ ఆంధ్ర యువ సంకల్ప్-2కే25 డిజిటల్ మారథాన్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వీడియోలు ఆహ్వానిస్తున్నట్టు యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి సోషల్ రెస్పాన్సిబి లిటీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, డిజిటల్ ఇన్నోవేషన్, ఏఐ టెక్నాలజీ, స్మార్ట్ యూత్ ఏపీ.... విభాగాల్లో సందేశాత్మక వీడియోలు తీసి పంపించాల్సి ఉంటుందన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగిన వారు అయి ఉండాలని, 120 సెకన్ల నిడివితో వీడియో ఉండాలన్నారు. షార్ట్‌లను వారి సొంత సోషల్ మీడియాలో (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ షార్ట్) మార్గదర్శకాల్లో చూపించిన అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్ట్ చేయాలని కోరారు. జ్యూరీల వచ్చిన ఎంట్రీలను పరిశీలించిన అనంతరం మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేలు ఇస్తారన్నారు. తొమ్మిది మంది విజేతలను 'ఆంధ్ర యువ సంకల్ప్-2కే25' అంబాసిడర్లుగా సత్కరిస్తారని చెప్పారు.

29న కాకినాడలో జయలక్ష్మి సొసైటీ మహాజన సభ సమావేశం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ది జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 4వ మహాజన సభ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. అజెండాలోని విషయాలను జయలక్ష్మి సొసైటీ సభ్యులందరికీ ఈ నెల 8వ తేదీన నోటీసు ద్వారా పంపించామన్నారు. జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంలో ఇద్దరు డైరెక్టర్లు, ఆఫీసు బేరర్ (ట్రెజరర్) పదవులు ఖాళీ అయ్యాయని... ఈ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు ఈ నెల 12న షెడ్యూలు జారీ అయ్యిందని, అదే రోజున ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రకటించామన్నారు. అందులో క్లెయిమ్స్, అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చైర్మన్/సీఈవోకి రాతపూర్వకంగా అందించాలని ఒక ప్రకటనలో కోరారు.



రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

'నన్నయ'లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విద్యార్థులకు బుధవారం డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 86 మంది విద్యార్థులు హాజరై రాత పరీక్ష రాయగా 54 మందిని షార్ట్ లిస్ట్ చేశారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. తర్వాత వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ డ్రైవ్‌ను వీసీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయం తరఫున ఎక్కువ మందికి ఉద్యోగావకశాలు కల్పించాలని కోరారు. తరచూ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ డ్రైవ్‌లు జరిపి ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాలు అందిపుచ్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చుకోవాలి

ప్రాంగణ నియామక శిక్షణ ప్రారంభోత్సవంలో నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంగా మార్చి లక్ష్యాలను చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుని కార్పొరేట్ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామక శిక్షణ (సీఆర్‌టీ) బుధవారం ప్రారంభమైంది.

ఇందులో పాల్గొన్న వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సీఆర్‌టీ ద్వారా గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్ ఉపాధి సామర్థ్యాలను పెంపొందిస్తూ కార్పొరేట్ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తారన్నారు. ఆప్టిట్యూడ్ పరీక్షలు, సాంకేతిక ఇంటర్వ్యూలు, బృంద చర్చలు వంటివి నియామక ప్రక్రియల్లో వారి పనితీరును మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు సహాయపడతాయని చెప్పారు. తద్వారా విద్యాభ్యాసం, పరిశ్రమ డిమాండ్ల మధ్య అంతరం తగ్గుతుందన్నారు. మూడు రోజులు జరిగే శిక్షణలో కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

విశ్వవిద్యాలయం ఉద్యోగ కల్పనాధికారి బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ పీఎం ఉషా సహకారంతో ఎస్‌డీవీఎల్ సంస్థతో విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ విభాగం, నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్వహిస్తున్న సీఆర్‌టీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ప్రశాంతి, సునీత వివిధ అంశాలను వివరించారు.



టేబుల్ టెన్నిస్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్

అండర్-14, 17 టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాలులో బుధవారం జరిగిన అండర్ 14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలో సుమారు 120 మంది పాల్గొన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. పీటీ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవిరాజు, పీడీలు లంక జార్జ్, మంగయమ్మ, వి.అరుణ, రవికౌర్, సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఎం.హరిబాబు, ఎల్.రవికుమార్, శ్రీహరిరాజు, శంషాద్ బేగం, ఎల్.సతీష్, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు వాయిదా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ సెలక్షన్లు, మండల స్థాయి సెలక్షన్లు, కాకినాడ జిల్లాలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగాల్సిన సెలక్షన్స్ వాయిదా వేశామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆ తేదీల్లో ఉమ్మడి మెగా డీఎస్‌ఏ వ్యాయామ ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో డ్యూటీలో ఉండడం వల్ల కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల కోసం నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలశర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి మూడు విడతల్లో సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాలుగో విడతలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవల్ చేయించుకోవాలన్నారు. లేదంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని తెలిపారు. మరిన్ని వివరాలకు 08842348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐలో ఈ నెల 30న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

బాకీ తీర్చేస్తానని పిలిచి.. బావిలోకి తోసేసి!

- ఇద్దరిని చంపి మరొకరిపై హత్యాయత్నం
- కాకినాడ జిల్లా తాటిపర్తిలో ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు!

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు ఇద్దరిని హత్య చేయడమే గాక నూతిలో పడవేసి మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగింది. ఈ సంఘటన బుధవారం పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

తాటిపర్తి గ్రామానికి చెందిన రంపం గంగాధ ర్ అవసరాల నిమిత్తం తన బంధువులైన రంపం శ్రీను (51), తోరాటి సూరిబాబు (44), కుంపట్ల సూరిబాబు (36) వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో గంగాధర్‌ను చెల్లించాల ని వారు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మం గళవారం రాత్రి 8గంటల సమయంలో రంపం శ్రీను, తోరాటి సూరిబాబుకు గంగాధర్ ఫోన్ చేసి అప్పు తీర్చేస్తానని, మాట్లాడే పని ఉందని పిలిచి పథకం ప్రకారం గ్రామ శివారుకు తీసుకువెళ్లాడు. అక్కడ పొలాల్లో ఉన్న బావి వద్దకు వెళ్లిన తర్వాత వారిద్దరిని నూతిలోకి తోసేసి హత్య చేశాడు. అనంతరం మరొక వ్యక్తి కుంపట్ల సూరిబాబుకు బాకీ ఇచ్చేస్తానని చెప్పి రమన్నాడు. గంగాధర్ సూరిబాబును తన మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ వాగు వద్దకు తీసుకువెళ్లి సెల్‌ఫోన్ పడిపోయిందని చెప్పి వెతుకుతున్నట్టు నటించాడు. అదే సమయంలో సూరిబాబును చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుని గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. కుంపట్ల సూరిబాబు ఫిర్యాదుపై పిఠాపురం సీఐ శ్రీనివాస్ కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాకినాడ ఏ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ సంఘటనా స్థలా న్ని పరిశీలించారు. రంపం శ్రీను కౌలు రైతు కాగా అతడికి భార్య బేబీ, ముగ్గురు కుమారులు ఉన్నారు. తోరాటి సూరిబాబు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య భవానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తి పొలాల్లోని బావిలో తేలిన మృతదేహం





హత్యకు గురైన శ్రీను, సూరి బాబు (ఫైల్)



సంఘటనా స్థలంలో పోలీసు జాగిలాలు

అప్పిస్తే ప్రాణం తీశాడు..

ఆపదలో ఉన్నాను, సొమ్ములు కావాలని చెప్పడంతో అప్పు ఇస్తే రంపం గంగాధర్ తమ వారి ప్రాణాలు తీశాడని తోరాటి సూరిబాబు, రంపం శ్రీను కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటన తాటిపర్తి పరిసర గ్రామాల్లో సంచలనంగా మారింది. పథకం ప్రకారమే గంగాధర్ ఈ ఇద్దరిని హత్య చేసినట్టు చెప్తున్నారు. కాగా కేసు దర్యాప్తులో ఉందని, ఆర్థికపరమైన విషయాలే ఈ సంఘటనకు కారణమని ఏఎస్పీ తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసు జాగిలాలు నిందితుడు రంపం గంగాధర్ ఇంటి వరకూ వెళ్లి ఆగాయి. అయితే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం తెలిసింది.



విలపిస్తున్న సూరిబాబు కుటుంబసభ్యులు

స్క్రూడ్రైవర్ నెయిల్ మింగిన బాలుడు

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన భద్రాచలం ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు



ఆపరేషన్ అనంతరం బాలుడితో వైద్యులు, సిబ్బంది



బాలుడు మింగిన నెయిల్

ఎటపాక, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఎనిదేళ్ల బాలుడు స్క్రూ డ్రైవర్ నెయి ల్‌ను మింగి ప్రాణాల మీదుకు తెచ్చు కున్నాడు. చివరకు భద్రాచలం ప్రభు త్వ వైద్యశాల వైద్యులు బాలుడి పేగులో ఇరుకున్న 6 సెంటీమీటర్ల స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను తొలగించి ప్రాణాలు కాపా డారు. అల్లూరి జిల్లా ఎటపాక మండ లం చోడవరం గ్రామానికి చెందిన తు మ్మల సునీల్, రాజేశ్వరి దంపతుల తు మ్మల గౌతమ్(8) మూడురోజుల క్రితం ఆడుకుంటూ స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగాడు. అప్పటి నుంచి కడుపులో నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు తెలి పాడు. తాను స్క్రూ డ్రైవర్ నెయిల్‌ను మింగానని తెలిపినా తల్లిదండ్రులు నమ్మలేదు. కడుపు నొప్పితో కుమారుడు బాధపడుతు న్నాడని తల్లిదండ్రులు బుధవా రం భద్రాచలం ఏరియా వైద్య శాలకు తీసుకెళ్లారు. దీంతో బాలుడిని పరీక్షించిన వైద్యులు ఎక్స్‌రే తీసి బాలుడి పేగులో స్క్రూడ్రైవర్ నెయిల్ ఇరుకున్నట్టు గుర్తించారు. దీంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది బృందం శస్త్ర చికిత్స చేసి 6 సెంటీమీటర్ల స్క్రూడ్రైవర్ నెయిల్‌ను తొలగించారు. బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడి క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో
సుప్రీం ఆదేశాలు పాటించాలి : పీడీజే



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఈ మేరకు బుధవారం మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ కమిటీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం-1988, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్స్ స్కీమ్-2022 నిబంధనలను అనుసరిస్తూ బాధితులకు పరిహారం అందజేయడంలో కమిటీ బాధ్యతగా వ్యవహరిస్తూ సహాయాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం ఆర్డీవోలు శ్రీకర్, కృష్ణ నాయక్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

16వ నెంబరు జాతీయ రహదారి
ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): జిల్లా సత్వరాభివృద్ధి, ప్రజల జీవన వికాసానికి దోహదం చేసే 16వ నెంబరు జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిని ఆరులైన్ల విస్తరణ కోసం నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో వివిధ అలైన్‌మెంట్ ఆప్షన్లతో సిద్ధం చేసిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో స్టేక్‌హోల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారిగా ఉన్న దీన్ని ఇరువైపులా విస్తరించి 60మీటర్ల వెడల్పుకు పెంచుతామన్నారు. వంపులు సరిచేయడానికి, జనా వాసాలను తప్పించడానికి అవసరమైన చోట్ల 60 మీటర్ల వెడల్పులో బైపాస్‌రోడ్లు ప్రతిపాదించామన్నారు. ప్రజల సౌకర్యం కోసం అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, సర్వీసురోడ్లు అలైన్‌మెంట్‌లో ప్రతిపాదించామన్నారు.

అలైన్మెంట్‌లతో డీపీఆర్‌కు రూపకల్పన

నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్ మాట్లాడుతూ జాతీయరహదారి విస్తరణలో భాగంగా అనకాపల్లి నుంచి అన్నవరం మీదుగా దివాన్‌చెరువు వరకు 741.255 కిలోమీటర్లు నుంచి 903.00 కిలోమీటర్ల వరకు ఉన్న నాలుగులైన్ల రోడ్డును ఆరులైన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేందుకు వివిధ అలైన్మెంట్‌లతో డీపీఆర్ రూపొందించామన్నారు. ప్రతిపాదిత ఆరులైన్ల రహదారి విస్తరణలో అనకాపల్లి, కసింకోట, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో 68.645 కిలోమీటర్లు, కాకినాడ జిల్లాలోని తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల్లో 80.600 కిలోమీటర్లు నిర్మిస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలో 11 కిలోమీటర్లు ప్రతిపాదించామన్నారు. మొత్తంగా 160 కిలోమీటర్లు మేరకు నిర్మించాలన్నారు. విస్తరణలో భూసేకరణ, నిర్మాణ వ్యయం, జనజీవనం, రహదారిపై కట్టడాలు, ఫ్లైఓవర్‌లు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.

మార్పులు సూచించిన ఎమ్మెల్యేలు..

ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప తమ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన రోడ్డులో అవసరమైన మార్పులు సూచించారు. జాతీయ రహదారి అంతా సౌరశక్తితో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల కోరారు. ఎన్‌హెచ్ 16, ఏడీబీ రోడ్డు కలిసే చోట రాజానగరం కూడలిలో ట్రంపెట్ కనెక్షన్ నిర్మించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. ధర్మవరం వద్ద జాతీయ రహ దారి పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటేందుకు అండర్‌పాసులు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. తొండంగి వైపున సర్వీసు రోడ్డు నిర్మించాలని తుని ఎమ్మెల్యే దివ్య సూచించారు. సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీఆర్వో వెంకట్రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ కంఠు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రసాద్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం జీజీహెచ్ అభివృద్ధికి
దాతలు ముందుకురావాలి : ఎంపీ



అధునాతన వైద్య పరికరాలు ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధికి దాతలు మరింతమంది ముందుకురావాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు గెయిల్ సమకూర్చిన అధునాతన వైద్యపరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేసే కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడుతూ బోధనాసుపత్రి ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని, దాతలు సహకరిస్తే ఎక్కువ మందికి సహాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. జీజీహెచ్‌లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో లేవని వైద్యులు, సిబ్బంది కొరత ఉందని చెప్తున్నారని, ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఏ ఒక్కరినీ కాకినాడ రిఫర్ చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్ఎంవో సుబ్బారావు పాల్గొన్నారు.

కాజులూరు రోడ్లు కానరావా?

- రోడ్ల దుస్థితిపై అఖిలపక్ష నాయకుల ఆందోళన
- వంటా వార్పు, రాస్తారోకో



కాజులూరు కృష్ణుడి గుడి వద్ద రోడ్డుపై వంటవార్పుతో ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

కాజులూరు(కరప), సెప్టెంబరు 17(ఆంధ్ర జ్యోతి): భారీ గోతులు, గతుకులతో అధ్వాన్నంగా మారిన కాకినాడ జిల్లాలోని కాజులూరు రోడ్ల దుస్థితిని నిరసిస్తూ అఖిలపక్ష నాయకులు బుధవారం తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టారు. కాజులూరు కృష్ణుడి గుడి వద్ద వందలాది మంది రాస్తారోకో చేసి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. రోడ్డుపైనే వంటా వార్పు నిర్వహించి అసంపూర్తిగా వదిలేసిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారితో బాటు ఇతర శిథిల రోడ్లు, వంతెనల నిర్మాణాలను ప్రభుత్వం తక్షణం చేపట్టాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేశారు. గతంలో రూ.36కోట్లతో చేపట్టిన గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారి నిర్మాణాన్ని వివిధ కారణాలతో మధ్యలోనే నిలిపివేశారని దీని వల్ల దాదాపు 30గ్రామాలకు చెందిన వేలాదిమంది నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపించారు. జూలైలో దీనిపై ధర్నా చేపట్టగా మంత్రి సుభాష్ ఆగస్టు 5 నుంచి పనులను పునఃప్రారంభిస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి రోడ్డుకు మోక్షం కలిగించాలని లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాజులూరు తహశీల్దార్ జి.రవీంద్రనాథ్, ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ ఘ టనాస్థలికి చేరుకుని ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కొంతమంది స్థానిక నేతల ప్రమేయంతో ఆందోళన విరమించారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, జేఏసీ నాయకులు సలాది నానాజీ, యాళ్ల సత్తిబాబు, శీల మాజీ ఎంపీటీసీ మాధవరపు నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డులో పడి గణిత ఉపాధ్యాయుడికి గాయాలు



గాయాలతో ఉపాధ్యాయుడు

గతుకులతో అధ్వానంగా మారిన కాజులూరు మండలం దుగ్గుదురు ప్రధాన రహదారిపై అదుపుతప్పి పడి ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. కాజులూరు హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చుండి శ్రీష మంగళవారం ఉదయం స్కూటీపై ద్రాక్షారామ నుంచి కాజులూరు హైస్కూల్‌కు బయలుదేరాడు. దుగ్గుదురు వచ్చేసరికి బండిపై నుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. తలతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలై కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాజులూరు మండలంలోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

రేపు కొత్త టీచర్లకు నియామకపత్రాల జారీ

విజయవాడలో అందజేయనున్న సీఎం చంద్రబాబు
ఉమ్మడి జిల్లా నుంచి 70 ఆర్టీసీ బస్సులు సిద్ధం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ - 2025లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి టీచర్లుగా విజయం సాధించిన అభ్యర్థులను విజయవాడ తీసుకెళ్లడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 70 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 19న విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొనే ఒక కార్యక్రమంలో కొత్త టీచర్లకు సీఎం నియామకపత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి వారంతా వెళ్లడానికి వీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 50 బస్సులు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి పదేసి బస్సుల చొప్పున కేటాయించారు. 19న ఉదయం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ నుంచి ఈ బస్సులన్నీ విజయవాడ బయలుదేరి వెళ్లనున్నాయి. ఇప్పటికే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకానికి ఏరోజుకారోజు బస్సులను సంసిద్ధం చేసే పనిలో తలమునకలై ఉన్న ఆర్టీసీ అధికార యంత్రాంగానికి తాజాగా విజయవాడకు బస్సులను కేటాయించాల్సి రావడం కత్తిమీదసాములా మారిందని చెప్తున్నారు.

డిప్యూటీ సీఎం, ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు

పిఠాపురం పోలీసులకు జనసేన నాయకుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లను కించపరిచే విధంగా సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న పవన్, ఎంపీలపై బి.ఐశ్వర్య అనే మహిళ అనుచిత వ్యాఖ్యలు చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

అమ్మోనియం గ్యాస్ లీకేజీ

తాళ్లరేవు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపాలెం వద్ద జెమినీ ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియం గ్యాస్ లీకవ్వడంతో బుధవారం గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామస్తులంతా ఐస్ ఫ్యాక్టరీ సిబ్బందిని నిలదీశారు. గ్రామస్తులతో డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు చర్చించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఐస్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల రైతుల పంటనష్టంపై విచారణ చేయించి న్యాయం చేస్తామన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

'నన్నయ'లో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూజీసీనెట్, జెఆర్ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలుపుతూ నన్నయ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. సీఎస్ఐఆర్‌నెట్, జెఆర్ఎఫ్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని స్పష్టంచేశారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబరు 4వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో గాని సంప్రదించాలని ఆమె తెలిపారు.

పోలీసునంటూ లారీ డ్రైవర్‌కు బెదిరింపు

కొవ్వూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసునంటూ లారీ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐచర్‌వ్యాన్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వైపు బయలుదేరాడు. మంగళవారం రాత్రి కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద జి యో పెట్రోల్‌బంకు వద్ద నిద్ర వస్తుందని వ్యాన్‌ను రోడ్డుపక్కగా ఆపి నిద్రించాడు. బుధవారం ఉదయం ఏపీ39 డీఎల్ 0942 నంబరు గల హూండాషైన్ బైక్‌పై సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఎస్ఐ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పెట్టుకుని వచ్చి రోడ్డుపక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు సరిగాలేదని డ్రైవర్ సంతోష్‌ను బెదిరించి స్టేషన్‌కు పద అని కొంతదూరం తీసుకువెళ్లి రూ2వేలు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరు వైపు వెళ్లిపోయాడు. సంతోష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

బైక్ చోరీపై కేసు

కె.గంగవరం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లిలో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా చెప్పారు. కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన బొజ్జా వెంకటరమణ ఈనెల 9న కోటిపల్లి శివాలయానికి అక్కడి నుంచి గోదావరి రేవుకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు వెంకట రమణకు బైక్‌ను దొంగిలించుకుని పోయారు. వెంకటరమణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జానీబాషా చెప్పారు.

ఫ్లాట్‌కి నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్



రవిని అరెస్ట్ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలో గోపీకృష్ణా రెసిడెన్సీలో మూడో అంతస్తులోని సీ-4 ఫ్లాట్‌కి డీజిల్ పోసి నిప్పంటించిన నిందితుడిని బుధవారం సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. రమణయ్యపేటకు చెందిన పిల్లి సత్తిబాబు, భార్య దుర్గ, ఇద్దరు కుమార్తెలు స్వజన, భానుచంద్రిక కుమారుడు మణి కార్తీక్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 14న ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎవరో ఆగంతకుడు ఫ్లాటులోకి డీజిల్ పోసి నిప్పు అంటించడంతో ఇంట్లోని ఫర్నీచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి కావడం, డీజిల్ వాసనకు శ్వాస ఆడక అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ప్రధాన డోర్ తీసేందుకు ప్రయత్నించినా, మంటలకు తలుపు రాకపోవడంతో రక్షించమని ఆర్తనాదాలు చేశారు. పరిసర ఫ్లాటులోని వారు వచ్చి తలుపు,అద్దం బద్దలుకొట్టి ఐదుగురు కుటుంబసభ్యులను కాపాడారు. ఈ ప్రమాదంపై తనకు ఇదే రెసిడెన్సీలో పెంట్‌హౌస్‌లో నివాసం ఉంటున్న పొన్నగంటి రవిచంద్రకుమార్ (రవి)పై అనుమానం ఉందని బాధితుడు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాల మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఫ్లాట్ లోపల, వెలుపల గల సీసీ కెమెరాలను పరిశీలించి, వాచ్‌మేన్‌తో పాటూ పలువురుని విచారించారు. సంఘటన జరిగిన రోజున ఫ్లాటులోకి అర్ధరాత్రి రవి ఒక్కడే సంచరించడాన్ని గుర్తించి అతడిని సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ అదుపులోకి తీసుకుని విచారించారు. సత్తిబాబుతో ఉన్న వ్యక్తిగత కక్షతోనే ఫ్లాట్‌లోకి డీజిల్ పోసి తగలబెట్టినట్టు నేరం అంగీకరించాడు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసు విషయంలో చురుగ్గా పనిచేసిన ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది సీఐ అభినందించారు.

వీధికుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన సత్యవతి



బిక్కవోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో బుధవారం గ్రామానికి చెందిన వాసిరెడ్డి సత్యవతి (60)పై వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. బుధవారం ఉదయం ఆమె ఇంటి ముందు తుడవడానికి బయటకు రాగా అక్కడే ఉన్న వీధి కుక్కలు దాడిచేసి చేతిపైన, నుదుటిపైన, ముక్కును కరచి గాయపర్చాయి. దీంతో స్థానికులు కుక్కలను తరిమేసి ఆమెను అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించారు.

20న జాబ్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీలో ఉద్యోగావకాశం కల్పించడానికి ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8639846568 నెంబరును సంప్రదించాలన్నారు.


కరప మండలం నడకుదురు వృద్ధాశ్రమంలో వృద్ధురాలికి పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


పెద్దాపురంలో గర్భిణికి పౌష్టికాహారం పెడుతున్న బీజేపీ నేత సూర్యనారాయణరాజు


కొత్తపల్లి పీహెచ్‌సీలో రోగికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

కరప, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడకుదురులో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాలయంలో మోదీ పేరిట అర్చనలు, అభిషేకాలు జరిపించారు. జనావళి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పుట్టా వీరప్రసాద్‌గాంధీ మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పిలుపు మేరకు అక్టోబరు 2వ తేదీ వరకు పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు యర్రంనీడి పద్మావతి, నాయకులు వనుం నాగబాబు, రెడ్డి రమణేశ్వర్, నల్లా వెంకటేశ్వరరావు, చిటిమిరెడ్డి గోవిందరాజులు, వీరబాబు, గోపిశెట్టి సుబ్బలక్ష్మి, జానకమ్మ, బల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో మాతృత్వం పేరుతో నిర్వహిస్తున్న పౌష్టికాహార పంపిణీని బీజేపీ రాష్ట్ర నాయకుడు వేటుకూరి సూర్యనారాయణరాజు ప్రారంభించారు. సుమారు 150 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ సభ్యులు దుర్గామోహన్‌రావు, రామ్‌కుమార్, పెన్నాడ జగన్నాథం, చెరుకూరి రవి, రత్నం, భార్గవి, గంగాభవాని, వెంకటపతి, విత్తనాల వెంకటరమణ, సురేష్‌కుమార్, దేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో కొత్తపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. యండపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. నాయకులు రవణం సుబ్రహ్మణ్యం, మేడసాని వరలక్ష్మీనారాయణ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాదగయ క్షేత్రంలో మోదీ తరపున పూజలు చేయించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

పెద్దాపురం ఎంపీడీవోగా సూర్యనారాయణ

పెద్దాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఎంపీడీవోగా కె.వెంకట సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో శేఖర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, సిబ్బంది రాజు, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను ఎంపీడీవో మర్యాదపూర్వకంగా కలిశారు.


సెలట్‌రాజుకు అభినందనలు తెలుపుతున్న మండల పరిషత్ సిబ్బంది

గొల్లప్రోలు ఎంపీడీవోగా సెలట్‌రాజు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ఎంపీడీవోగా ఎన్.సెలట్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రపురం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఈయన్ను ఉద్యోగోన్నతిపై తొలుత పిఠాపురం ఎంపీడీవోగా నియమించగా పరిపాలనా సౌలభ్యం కోసం గొల్లప్రోలు మార్చారు. గొల్లప్రోలు ఎంపీడీవోగా ఉన్న కర్రి స్వప్నను పిఠాపురం రెగ్యులర్ ఎంపీడీవోగా నియమించారు. ఎంపీడీవో సెలట్‌రాజును కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కాంస్య విగ్రహాల పరిశీలన

తాళ్లరేవు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ జాతి అభివృద్ధి నేతలు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, మల్లాడి సత్యలింగనాయకర్ కాంస్య విగ్రహాలను అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం ఆధ్వర్యంలో రూ.18 లక్షలతో కొత్తపేటలో శిల్పి రాజకుమార్ వడయార్‌తో తయారు చేయించి కోరంగ తీసుకొచ్చారు. వీటిని కోరంగ వై.జంక్షన్ వద్ద బొడ్డు సత్యనారాయణ ప్రాంగణంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం పరిశీలించారు. విగ్రహాలకు మందిరం నిర్మించిన సత్యనారాయణను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ నేతలు దంగ్రుప్రోలు నాగబాబు, వైదాడి నూకరాజు, బర్రే నరసింహరాజు, వాడ్రేవు వీరబాబు, మల్లాడి సీతారామరాజు, వైదాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పీడీఈ విధానంలో లోపాలను సరిదిద్దాలని కోరుతూ ఈ నెల 19, 20 తేదీల్లో పెన్ డౌన్ సమ్మె తలపెట్టినట్టు కాకినాడ నగర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 0.2 విధానం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు, దస్తావేజు లేఖరులకు విపరీతమైన అసౌకర్యం కలుగుతోందన్నారు. ఓటీపీలు బహిర్గతం చేయడానికి ప్రజలు సంకోచిస్తున్నారన్నారు. ఆటోమ్యూటేషన్ సిస్టమ్ మంచిదే కానీ, డిపార్ట్‌మెంట్లలో సమన్వయలోపం వల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమావేశంలో సంఘ జిల్లా నాయకుడు జాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎం ప్రాథమిక పాఠశాల తనిఖీ

సామర్లకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను డీవైఈవో కేవీవీ సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్యతో కలిసి అకడమిక్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆగస్టు నెలలో జరిగిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. హెచ్‌ఎం సుగుణామణికి పలు సూచనలు చేశారు. కాకినాడ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ పాఠశాల ముగిసిన తర్వాత 3.30 నుంచి 4.30 వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమెడియల్ క్లాసులు నిర్వహించాలన్నారు. తెలుగు, ఆంగ్లం సబ్జెక్టులకు చెంది ప్రతిరోజూ 5 మార్కులకు డిక్టేషన్ కండక్ట్ చేయాలని డీవైఈవో ఆదేశించారు.

ఎరువుల విక్రయాలపై ఫిర్యాదులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతుల నుంచి అందిన ఫిర్యాదులపై వ్యవసాయాధికారులు స్పందించారు. గ్రామంలోని నాగదుర్గ ఏజెన్సీస్‌కు 30 టన్నుల యూరియా వచ్చింది. దీనిని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ అక్కడకు చేరుకుని షాపు దగ్గరే ఉండి ఎమ్మార్పీకే యూరియాను అమ్మించారు.

'పార్టీలకతీతంగా కలిసి పనిచేద్దాం'



కరప మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేద్దామని ఎమ్మెల్యే పంతం నానాజీ సభ్యులకు సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దామని, మిగిలిన సమయమంతా ప్రజాసేవకే వెచ్చిద్దామన్నారు. వివిధ శాఖల అధికారులు మండలంలో జరిగిన ప్రగతిని సభ్యులకు వివరించి వారు లేవనెత్తిన సమస్యలకు సమాధానాలిచ్చారు. వ్యవసాయ, విద్యా శాఖల పనితీరును ఎమ్మెల్యే మెచ్చుకుని ఆ శాఖల అధికారులను అభినందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని సూచించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరప సొసైటీ ఛైర్‌పర్సన్ సైనవరపు భవానీశంకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు దుర్గాప్రసాద్, ఏవో బీఎల్ నరసింహం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ, నీటి సంఘాల అధ్యక్షులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

'బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటు'


ఇంటర్ విద్యార్థినికి యూనిఫామ్ అందజేస్తున్న కోరమాండల్ యూనిట్ హెడ్ జగన్నాథన్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన సంక్షేమ, మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందిస్తామని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ కె.జగన్నాథన్ పేర్కొన్నారు. బుధవారం రమణయ్యపేట ఏపీ ఎస్పీ హైస్కూల్ ప్లస్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజు ఆధ్వర్యంలో కోరమాండల్ సీఎస్ఆర్ నిధులు రూ.లక్షతో 96 మంది విద్యార్థినులకు యూనిఫారాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం వేళ విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా సిమెంటు బెంచీలు, సిమెంట్ డైనింగ్ టేబుల్స్ ఏర్పాటుచేస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని, ఇందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ గాయత్రి కోరారు. త్వరలోనే డైనింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయిస్తానని యూనిట్ హెడ్ జగన్నాథన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోరమాండల్ సీనియర్ మేనేజరు పద్మనాభన్, సీఎస్ఆర్ మేనేజరు వంశీకృష్ణ, బ్రాండింగ్ మేనేజరు యశోదకృష్ణ, హైస్కూల్ ప్లస్ పీజీటీలు కృష్ణవేణి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, శంకర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పెద్దాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వర్ధులవారి వీధిలో కొలువైయున్న భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ బుధవారం రాట ముహూర్తం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చింతా గోపిశర్మ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి ప్రతిరోజూ అమ్మవారికి అభిషేకం, సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణ, హోమాలు జరుగుతాయన్నారు. పూజల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనదలచిన భక్తులు 98661 93557 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


కాకినాడ పోర్ట్ స్టీవ్ డోర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్ట్ స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదం చంద్రశేఖర్ (మహేష్), ఉపాధ్యక్షుడిగా కెప్టెన్ దాస్, కార్యదర్శిగా పీవీ రావు, కోశాధికారిగా ఏవీ చలం, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.సాయిరామ్, ఎం.కృష్ణ, వి.రామయ్య, ఎంఎస్ఎస్ కల్యాణ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వారణాసి బాబు అభినందించారు.

'పిఠాపురంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన పనులను వేగవంతంగా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న పనుల పురోగతిపై బుధవారం ఆయన కలెక్టరేట్లో సమీక్షించారు. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల పరిధిలో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, పశువుల షెడ్లు, నీటి కుంటల పనులు జరుగుతున్నాయన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వీటిని వేగవంతంగా చేయాలన్నారు.

సమావేశంలో శిక్షణా కలెక్టర్ మనీషా, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి, పాడా ఇన్‌చార్జి పీడీ వేణుగోపాలరావు, ఏపీడీ వసంత మాధవి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాలని ఆమ్ ఆద్మీ పార్టీ కాకినాడ జిల్లా శాఖ, అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల వరదరాజు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేదనే కారణంతో కొన్ని ప్రైవేటు కళాశాలల్లో పరీక్ష ఫీజులు కట్టించుకోకుండా విద్యార్థులను అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

ధర్నాలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధి సూరిబాబు, అఖిలపక్షం కన్వీనర్ దుర్గారమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణమోహన్, మహ్మద్ రియాజ్, కనకదుర్గ పాల్గొన్నారు.

'పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు విరివిగా పెంచాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సేవా పక్వాడాలో భాగంగా తిమ్మాపురం అక్నూ పీజీ క్యాంపస్ ప్రాంగణంలో ఓఎన్జీసీ ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అసెట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ వంద మొక్కలు నాటారు. విద్యార్థులతో మొక్కలు నాటించే మంచి కార్యక్రమం ఏర్పాటుచేసిన ఓఎన్జీసీ, అటవీ శాఖ అధికారులను ఆమె అభినందించారు. ఓఎన్జీసీ ప్రతినిధులు రవీంద్ర, సన్నీచౌదరి, అటవీ శాఖ అధికారులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



సామర్లకోట మండలం వేట్లపాలెం, పెదపూడి మండలం గొల్లల మామిడాడల్లో విశ్వకర్మ జయంతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు చినరాజప్ప, రామకృష్ణారెడ్డి

ఘనంగా విశ్వకర్మ జయంతి

కరప, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెనుగుదురులో విశ్వకర్మ భగవాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ యువ సంక్షేమ సేవా సంఘం కాకినాడ రూరల్ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాస్, కార్యదర్శి కోచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, మాజీ ఉప సర్పంచ్ బండారు సతీష్, తుమ్మలపల్లి సూరిబాబు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెదపూడి (కరప) (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా పెదపూడి మండలం గొల్లలమామిడాడ శివాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. బీజేపీ, టీడీపీ, జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. విశ్వకర్మ పథకాన్ని టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, గుమ్మళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): విశ్వ నిర్మాతగా పేరొందిన దేవతా శిల్పి విశ్వకర్మ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు




సామర్లకోటలో స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప, కరప మండలం గురజనాపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి

'ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం'

సామర్లకోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజానికి 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' దోహదపడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, దేవళ్ళ జయలక్ష్మి, పైండి శ్రీనివాసు, బొందల రామలక్ష్మి, కంచర్ల సుష్మామోహిని, వైద్యాధికారులు వరలక్ష్మి, అమల, రాకేష్, డాక్టర్ ప్రవీణ, కన్యాకుమారి, కిరణ్‌చౌదరి, హెచ్ఎన్ ఉషారాణి, ఐసీడీఎస్ పెద్దాపురం సీడీపీవో జి.ఉష, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): ఇంటిని చక్కబెట్టే ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని... మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో యాసరపు లక్ష్మి సూచించారు. గురజనాపల్లిలో వైద్య, ఆరోగ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో ఆమెతో పాటు మండల వైద్యాధికారిణి ఏంజెలినా మాట్లాడారు. పలువురు మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ అనుసూరి శ్రీనివాస్, ఎంపీటీసీ యండమూరి వీరవేణి, కార్యదర్శి ఎం.సురేష్, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పబ్బినీడి వెంకటకృష్ణ, మామిడాల వెంకటేష్, ముద్రగడ రమేష్, బండారు మురళి, దేవు వెంకన్న, పంపన కన్నారావు, చీపురుపల్లి జయేంద్రబాబు, శాస్త్రి, పెంటపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని డిస్పెన్సరీలో జేఎన్టీయూకే, కిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 31 వరకు నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సిబ్బందికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేత్ర పరీక్షలు చేసేందుకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ 90వ ర్యాంకర్ నానాజీకి సత్కారం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 (సోషల్)లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 90వ ర్యాంకు సాధించి అర్బన్ పరిధిలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఈతకోట నానాజీని బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రధాని మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ సెంట్రల్, మండల నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కేక్ కట్ చేశారు.


లబ్ధిదారులతో కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్స నిమిత్తం 13 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7.25 లక్షలు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు వీటిని చెక్కుల రూపంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గదుల సాయిబాబు, ఎస్కే రహీమ్, చింతలపూడి రవి, పీర్ల లక్ష్మీప్రసన్న, పొంగా బుజ్జి, ముత్యాల రాణి, పాలిక నాని, అమలకంటి బలరాం, నీలకాయల సన్నీకిరణ్, రెడ్నం సత్తిబాబు, దంగేటి సతీష్, బొల్లోజు ఉమా, కోలా ఎల్లారావు, విసంశెట్టి బాబ్జీ, కాళ్ల సత్తిబాబు, పెదపూడి కుమార్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'పిఠాపురం మహారాజా జిల్లాగా నామకరణం చేయాలి'

పిఠాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా కాకినాడ జిల్లాగా నామకరణం చేయాలని వివిధ రంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మహారాజా జిల్లా కార్యాచరణ కోసం బుధవారం తొలి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు అక్టోబరు 5న విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. కాకినాడ జిల్లా ప్రజలందరూ ఇందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు, సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ వెన్నపు చక్రధరరావు, 'మన ఊరు-మన బాధ్యత' సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, ఈగల త్రిమూర్తులు, చిన్నారి సతీష్, కొమ్మనాపల్లి అప్పారావు, కేవీవీఎస్ ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రధాని మోదీకి శుభాకాంక్షలు

జగ్గంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా స్థానిక నాయకుడు పాఠంశెట్టి సూర్యచంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన తీసుకున్న సంకల్పాలు, ఆచరణలో పెట్టిన సంస్కరణలు, సాధించిన అంతర్జాతీయ గుర్తింపు భారతీయులందరికీ గర్వకారణమన్నారు. మోదీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే



సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కేశవ్

రాజవొమ్మంగి సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. బుధవారం రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షుడుగా ముప్పన డింబకేశ్వరరావు (కేశవ్) ప్రమాణ స్వీకారం చేశారు. రాజవొమ్మంగి జయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతప్రభుత్వంలో సొసైటీరుణాల మంజూరులో పార్టీలు చూసే వారన్నారు. ప్రస్తుత చైర్మన్, అధికారులు రుణాల మంజూరులో అర్హత ఉంటే ఇవ్వాలని, పార్టీలు చూడవద్దన్నారు.నూతన చైర్మన్ కేశవ్, సభ్యులుగా మద్దెసు గంగయ్య, విశంశెట్టి చిట్టమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, దంతులూరి శివరామచంద్రరాజు, గణజాల తాతరావు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగిసర్పంచ్ గొల్లపూడి రమణి, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు మధ్యలో నిలిపేస్తున్నారు.. సభ్యుల ధ్వజం

వై.రామవరం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలో లోతట్టు ప్రాంతాల్లో మంజూరైనరహదారి నిర్మాణాలను సర్పంచ్‌లకు తెలియకుండా మధ్యలోనే నిలిపివేస్తున్నారని మండల సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. చింతలపూడి పెరికివలసలో ఆరు కిలోమీటర్ల రోడ్డు కొంత మేరకు నిర్మించి వదిలేశారని, ఉన్నతాధికారుల చుట్టూ అధికారులు, రాజకీయ నాయకులు తిరిగి మంజూరు చేయించుకున్న రోడ్లను నిర్మించకపోతే సహించేది లేదని ఎంపీపీ ఆనందరావు ఇంజనీరింగ్ అధికారిని నిలదీశారు. రైతులు యూరియా కొరతతో ఇబ్బందులకు గురవుతున్నారని సభ్యులుఆవేదన చెందారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారని, వసతి గృహాల్లో మెనూ అమలులో లోపాలున్నాయని ఆకస్మిక తనిఖీలు చేసి సరిదిద్దాలని ఎంఈవో తాతబ్బాయి దొరకు ఎంపీపీ సూచించారు. జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వామ్మ, జోగిరెడ్డి, ఎంపీటీసీలు కరకా వెంకటరమణ, శుభలక్ష్మి, తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

రంపచోడవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి బుధవారం గర్భిణులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈక బుల్లికొండలు దొర, సీనియర్ నాయకులు కారం సీతారామన్నదొర(ఢిల్లీబాబు), జిల్లాకార్యదర్శులు కె.ఎల్.ఎన్.గురుప్రసాద్, కుండ్ల కృష్ణారెడ్డి, గిరిజన మోర్చా తుర్రం బాబురావుదొర, మండలాధ్యక్షుడు చోళ్ల విశ్వరెడ్డి, మండల కార్యదర్శి సవిర్ల అబ్బాయిరెడ్డి, కురసం వరలక్ష్మి, సారపు వీర ప్రతాప్‌దొర, కారం చిన్నబ్బాయి, కొనుతూరి రవితేజ, బూత్ అధ్యక్షుడు సూంత్రు సాంబశివ రావు, కార్యదర్శి కడబాల బాబూరావు పాల్గొన్నారు.

చింతూరు, (ఆంధ్రజ్యోతి): మోదీ 75వ జన్మదిన వేడుకలు చింతూరులో నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నామాల శ్రీనివాసరావు, లచ్చు, వెంకటరామయ్య, నర్సింహరావు, రామారావు, శ్రీరాం, జహంగీర్, నాగేశ్వరరావు కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక, (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. గన్నవరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బొజ్జిగుప్ప గ్రామం పాఠశాల ఆవరణలో బీజేపీ మండలాధ్యక్షుడు నలజాల శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో నాయకులు మూడే సతీష్‌కుమార్, మోదుగు పెరమయ్య, బొల్లా ప్రసాద్, పులుసు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆరోగ్యంపై దృష్టి సారించాలి

చింతూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్యంపై దృష్టి సారించాలని చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంనిర్వహించారు. ఈనెల17నుంచి అక్టోబరు2వరకు ఏరియా ఆసుపత్రిలో ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ మండల కమిటీ చైర్మన్‌గా రామకృష్ణ

చింతూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ జేఏసీ చింతూరు మండల కమిటీ చైర్మన్‌గా పొడియం రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారంఆదివాసీ జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ చింతూరు డివిజన్ జేఏసీ నేతృత్వంలో ఎన్నిక జరిగింది. కుంజా శ్రీను, కాక సీతారామయ్య, కారం చందు, గోరెం రాఘవయ్య, పద్దం అర్జున్, సోయం మహేష్, తుర్రం వెంకటనారాయణ, తుర్రం నీలయ్య, తుర్రం మూర్తి, తుర్రం రమేష్, మడివి రాజుతో కూడిన కమిటీ ఏర్పడింది.

మోతుగూడెంలో పోలీసుల తనిఖీలు

మోతుగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పంచాయతీ గొంది గూడెంలో బుధవారంకార్డెన్ అండ్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితుల వివరాలు సేకరించారు. ఈసందర్భంగా ఎస్ఐసాదిక్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

మోతుగూడెం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఇచ్చినపిలుపుమేరకు మూడోరోజు బుధవారం లోయర్ సీలేరు, అప్పర్ సీలేరు, డొంకరాయిలో చీఫ్ ఇంజనీర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆఫీస్, పవర్ హౌస్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. నిరసనలో జేఏసీ నాయకులు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో విశ్వకర్మ జయంతి

రంపచోడవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ చరిత్రను తెలుసుకునే బాధ్యత అందరిపై ఉందని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఎస్‌వో టి.మార్తమ్మ, ఏఈ చైతన్య, డాక్టర్ కేధరిన్, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత నిరసన

రంపచోడవరం,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఐదోషెడ్యూల్ ప్రాంతంలోని ఉపాధ్యాయ పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆదివాసీ నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో బుధవారం ఐటీడీఏ ఎదుట నిరసన చేపట్టారు. సీపీఎం నాయకుడు లోతా రామారావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్రఅధ్యక్షుడు వంతు బాలకృష్ణ, తెల్లం శేఖర్, పీడీఎస్‌యూజిల్లా అధ్యక్షుడు ఐ.వి.రమణ, కార్యదర్శి పల్లాల లక్ష్మణరెడ్డి, మద్దేటి అంజిరెడ్డి, న్యూడెమోక్రసీ నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

'పంచాయతీపై కావాలనే విషప్రచారం'

కూనవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూనవరం పంచాయతీపై కావాలని కొందరు వ్యక్తులు విషప్రచారం చేస్తున్నారని పంచాయతీ ప్రెసిడెంట్ మల్లంపల్లి హేమంత్ అన్నారు. తనకు సంబంధంలేని విషయాల్లో తనను లాగుతున్నారన్నారు. 2022 గోదావరి వరదల్లో తాను సర్పంచ్‌గా లేనని, అప్పట్లో జరిగిన నిధుల వ్యవహారంలో తనపాత్ర ఉందంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తనపై అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులకు సంబంధించి శుక్రవారం మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ టి.గాబ్రియేల్ తెలిపారు. ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

మహిళలను శక్తివంతులుగా చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆరోగ్యపరంగా శక్తివంతులుగా చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలకు వైద్య సేవలందించేందుకు ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను ప్రారంభించారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.గీతా సుధ, ఉషశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ కార్యక్రమ ంలో భాగంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వాసుపత్రి సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నా రు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, మెరుగైన సమాజం రూపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయని తె లిపారు. ఎమ్మెల్యే, అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజులను ఆసుపత్రి వైద్యులు సన్మానించారు. సమావేశంలో కూటమి నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, ఇళ్ళ అప్పారావు, సుంకర సోమరాజు, యాళ్ళ జగదీష్, ఆసుపత్రి సిబ్బంది అజయ్, ఎం.చంద్రరావు, గళ్ళా తాతారావు, చక్రి, సారిపల్లి లోకేష్, బత్తుల బాస్కర్ ఉన్నారు.

పౌష్టికాహార మాసోత్సవ శిబిరం ప్రారంభం

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవ శిబిరాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, చక్రవేణి, మాజీ సర్పంచ్ బుద్ధరాజు సుబ్బరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు జె.మంగాదేవి, పీవీ సుబ్బలక్ష్మి, ఎన్‌వీ సత్యవతి, పీవీ వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డిసాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పా రావు, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, బీజేపీ నాయకుడు సత్తిరాజు పాల్గొన్నారు.

బస్టాప్‌లను పరిశీలించిన ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్



మల్లేపల్లిలో బస్సును పరిశీలిస్తున్న మేనేజర్

గండేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీవీ సత్యనారాయణ గండేపల్లి మండలంలో ఉన్న బస్టాప్‌లను పరిశీలించారు. మల్లేపల్లిలో బస్సును ఆపి నిలబడి ఉన్న ప్రయాణికులను బస్సులోకి ఎక్కించారు. బస్టాప్‌ల వద్ద తప్పనిసరిగా బస్సులు ఆపాలని డ్రైవర్లకు సూచనలిచ్చారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజుతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెద్ద గ్రామాల్లో ఒకటే బస్ స్టాప్ ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని 2,3 చోట్ల బస్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. బస్టాప్‌లకు బోర్డులు ఏర్పాటుచేస్తామని, ప్రయాణికు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని మేనేజర్ తెలిపారు.

వేలంక ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నిక

కిర్లంపూడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలంక శెట్టిబలిజపేట రామాయలంలో బుధవారం ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నిక జరిగింది. ఎలక్షన్ ఆఫీసర్ నూకరాజు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా కాళ్ల సూర్యనారాయణ, సెక్రటరీ కడగల రాంబాబు, ఏడుగురు డైరెక్టర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ రాయుడు బాబురావు అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సర్వ శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ సీఆర్పీడబ్ల్యూఏ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీప్రసాద్ కోరారు. విశాఖ నుంచి విజయవాడ వెళుతున్న ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు బుధవారం రాత్రి మండలంలోని రాచపల్లి అడ్డరోడ్డు వద్దకు చేరుకోగా ఆయనను కలిసి రాంజీప్రసాద్ వినతి పత్రం అందజేశారు. గడిచిన ఐదుఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు పెంచడం లేదని రాంచిప్రసాద్ ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. స్థానిక సీఆర్పీ కొల్లు గంగారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ చైర్మన్ వైడీ రామారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రామ్మోహన్ ప్రసాద్ హాజరైనట్టు చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు తెలిపారు. వైద్య బృందం 93మంది నుంచి రక్తాన్ని సేకరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావును సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.రాజశేఖర్ ఫణీంద్ర, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

కోటనందూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి రైతు సేవాకేంద్రంలో ట్రైనర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో చేయవలసిన పనులు, ట్రక్కు సీట్ జనరేట్ చేయడం, తేమ శాతం చూడడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గప్ప అప్పారావు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం

తుని రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమేరు గ్రామానికి చెందిన ఓ మహిళకు 108సిబ్బంది పురుడు పోశారు. 108లో వెళ్తుండగా మార్గమధ్యలో మహిళకు పురిటినొప్పులు ఎక్కువయ్యా యి. 108లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీనివాస్ మహిళకు పురుడు పోశాడు. ఆమె ఆడ బిడ్డకు జన్మనించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈఎంటీ శ్రీనివాస్‌ను, పైలెట్‌రామును పలువురు అభినందించారు.

మహిళ ఆరోగ్యంతో ప్రతి కుటుంబం భద్రం

తుని రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళ ఆరోగ్యంతో ప్రతి కుటుంబం భద్రంగా ఉంటుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. హెచ్.కొత్తూరులో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు చాలామంది ఆరోగ్యం చూసుకోవడం లేదన్నారు. వ్యాధులు ముదిరాక ఇబ్బందులు పడుతున్నారని, ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో బుధవారం నుంచి అక్టోబరు 2వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తేటగుంట పీహెచ్‌సీ వైద్యులు జి.నీరజ, డాక్టర్ మంజుల, టీడీపీ యువనాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కటారి నాగసత్యనారాయణ, కటారి రామస్వామి, నక్కా శ్రీను ఉన్నారు.

లోవ దేవస్థానంలో ప్లాస్టిక్ నిషేధం

తుని రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా లోవ దేవస్థానాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. లోవదేవస్థానం ఈవో పి.విశ్వనాథరాజు అధ్యక్షతన ఈవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ప్లాస్టిక్ వస్తువులు, అమ్మకాలు, వినియోగం నిషేధంపై వ్యాపారస్తులకు పలు సూచనలు ఇచ్చారు. భక్తులను చైతన్యపరిచే దిశగా ఆలయంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఈవో తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



ఏలేశ్వరంలో నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దిబ్బలపాలెం సంతోషీమాత ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ కమిటీ నేతృత్వంలో చల్లా ప్రసాద్ శ్రీదుర్గ దంపతులు కొబ్బరికాయలు కొట్టి పందిరి రాట వేసి ముహూర్తం చేశారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆలయం వద్ద ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, మాజీకౌన్సిలర్ సుంకర రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడిలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాల నిర్వహణకు పందిరాట నిర్వహించారు. గ్రామపెద్దలు మిరియాల శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు కనకదుర్గ అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు పందిరి రాట మహోత్సవాలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గానాల గంగాధర్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తొలుత విశ్వకర్మ పతాకాన్ని సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సింగిలిదేవ్ సత్తిరాజు, విశ్వబ్రహ్మ నాయకులు ధర్నాల కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు దుర్గభక్తుల సత్యనారాయణ నేతృత్వంలో గుల్ల ప్రసాద్, స్వర్ణలత దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. పట్టపు సూర్యనారాయణ కుటుంబీకులు అన్నప్రసాదం వితరణ చేపట్టారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, మహిళలు ఉన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి సహిత విశ్వకర్మ వీరబ్రహ్మేంద్రస్వామి వారి నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి మహాయజ్ఞం నిర్వహించారు. అధ్యక్షుడు గానుగుల శ్రీనివాస్, కార్యదర్శి కొత్తల వీర ప్రసాద్, లక్కోజు శివరామకృష్ణ, అత్తిలి వీర బ్రహ్మం, కొమ్మోజు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాళాబత్తుల సాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'తృణధాన్యాల సాగు లాభదాయకం'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తృణధాన్యాల సాగు ఎంతో లాభదాయక మని పెద్దాపురం, జగ్గంపేటల సబ్‌డివిజన్‌ల ఏడీఏలు మాలకొండయ్య, శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని ఇగోకవరం గ్రామంలో బుధవారం జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ పథకంలో భాగంగా రైతులకు పోషక తృణధాన్యాల సాగుపై శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక మండల వ్యవసాయాధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఏడీఏలు మాట్లాడుతూ తృణధాన్యాల వల్ల పోషక విలువలు పెరగడంతో పాటు ఈ సాగు రైతులకు లాభదాయకంగా మారుతుందని తెలిపారు. తృణధాన్యాల సాగులో మెళకువలు, వాటి ఉపయోగాలు ఏడీఏలు రైతులకు వివరించారు. రాగి పంట వేసిన పొలాలను రైతులతో కలిసి వ్యవసాయాధికారులు సందర్శించారు పెద్దాపురం డీఆర్సీ ఏవో సంజీవ్, ప్రత్తిపాడు ఏఈవోలు బలరాం, అర్జున్, బీహెచ్‌కే గణేష్, రైతులు పాల్గొన్నారు.



ఇ.గోకవరంలో సూచనలు ఇస్తున్న జగ్గంపేట ఏడీఏ శ్రీనివాస్, పెద్దాపురం ఏడీఏ మాలకొండయ్య

ఉన్నత విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు

• ఎమ్మెల్యే యనమల దివ్య



కళాశాల నూతన భవనాల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న యనమల దివ్య

తొండంగి, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తీరప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కాళాశాల ఏర్పాటుచేసి అత్యాధునిక కోర్సులు అందుబాటులో ఉంచినట్లు ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం వాకదారిపేటలో గ్రామంలో రూ.1.57కోట్ల సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించనున్న భవనాలకు ఆమె శంకుస్థాపన చేశారు. అత్యంత వెనుకబడిన కోన ప్రాంతంలో ప్రజలకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు కళాశాలకు సొంత భవనాలు సమకూరలేదని, దీనిపై కలెక్టర్‌తో సంప్రదించి సీఎస్ఆర్ నిధులు విడుదల చేయించామన్నారు. ఈనిధులతో ఆధునిక వసతులతో కూడిన భవనాలు నిర్మాణం జరుగుతాయన్నారు. దీంతో నూతన కోర్సులు ప్రారంభించేం దుకు వీలవుతుందన్నారు. మండలంలో అనేక పరిశ్రమ ఏర్పాటుతో పారిశ్రామి కంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఒకప్పుడు ప్రాథమిక విద్య కూడా గగనమైన కోన ప్రాంతంలో నేడు ఉన్నత చదువులు అందుబాటులోకి తీసుకు వచ్చిన ఘనత పొలిట్‌బ్యూరో సభ్యులు యనమలకు దక్కుతుందన్నారు. తాను కూడా ఆయన బాటలోనే పయనిస్తూ మండలాన్ని విద్యాపరంగా ఉన్నత స్థాయితో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సినీయర్ నేత యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, టీడీపీ జిల్లా మత్స్యకా సంఘం అధ్యక్షులు కోడా వెంకటరమణ, చొక్కా అప్పారావు, పేకేటి దారకొండ, అంగులూరి సుధాకర్, ప్రిన్సిపాల్ మోహన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పోషణ మహోత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేట శివారు పరిణయ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జగ్గంపేట సీడీపీవో ఆధ్వర్యంలో పోషణ మహోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. మహిళల చట్టాలు, పోషక విలువలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకుని గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

చెత్త తొలగింపు



ఏలేశ్వరంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. వార్డుల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా నగర పంచాయతీ శానిటేషన్ సిబ్బందిని, వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నర్సీపట్నం రోడ్డులో విద్యుత్ కార్యాలయం వద్ద రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను బుధవారం జేసీబీ సహాయంతో తొలగించారు.

నాగబాబుకు అభినందన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన నెల్లిపాక నాగ సత్యనారాయణ (నాగబాబు)ను బుధవారం ప్రత్తిపాడులో బీసీ సంఘాల నాయకులు సన్మానించి అభినందించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో నాగబాబుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సీమాంధ్ర బీసీ సంఘ నాయకులు ఒమ్మి గంగరాజు యాదవ్, మదినే నూకరాజు, ఎం.రాజారావు, కె.లక్ష్మీనారాయణ, అడ్వకేట్ చిలపర్తి శ్రీనివాస్, నెల్లిపాక అమ్మిరాజు, పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన తోట

కిర్లంపూడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభాన్ని బుధవారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రి వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి తోట రాంజీ కలిశారు. ముద్రగడ ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

మహాసేన రాజేష్ జన్మదినం



రాజేష్‌కు కేక్ తినిపిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాజేష్ కేకు కట్ చేసి అభిమానులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, జువ్వల సురేష్, ఎన్కె గ్రానైట్ కళ్యాణ్ మహాసేన యూత్ సభ్యులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు సత్కారం

కిర్లంపూడి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని ముగ్గురు ఉపాధ్యాయులకు కిర్లంపూడి ఎంఈవో కార్యాలయంలో బుధవారం సన్మానం చేశారు. జనసేన జగ్గం పేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.



'జరిగిన అభివృద్ధి అప్పుడే'

రౌతులపూడి, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందని, కూటమి ప్రభుత్వంలో మాటలు తప్పా అభివృద్ధి శూన్యమని వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరి అన్నారు. దిగిశివాడ, గంగవరం, ఆర్.వెంకటాపురం గ్రామాల్లో బాబుమారిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగూరి శివకుమారి, జడ్పీటీసీ గొల్లు చినదివాణం, సర్పంచ్‌లు కోరుప్రోలు దేవుడుపాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

శంఖవరం, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల22 నుంచి జరగనున్న దసరా మహోత్సవాలను శంఖవరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం శివాలయం ఆవరణలో శ్రీశివ సత్యసాయి ఆటో యూనియన్ పసుపురాట వేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొమ్మిడి సత్తిబాబు, బొమ్మిడి బాష, బొమ్మిడి బాబ్జీ, కోట్ని బుజ్జి, బుర్రా రాజు, వంకాయల వెంటేష్, పల్లా వీరబాబు, దేవారపు సుబ్రహ్మణ్యం, పడాల గోవిందు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.